సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం ׀ 11 ׀ ఏప్రిల్ ׀ 2024



గ్రూప్‌-2 మెయిన్స్‌కు 43 మంది అర్హత

IIలో

గండిపోశమ్మ జాతర ప్రారంభం



గండిపోశమ్మ అమ్మవారు

దేవీపట్నం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందిన గండిపోశమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు అమ్మవారిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు రెండు వేల మంది దర్శించుకున్నారు. టికెట్ల విక్రయం ద్వారా రూ.11,500 ఆదాయం సమకూరినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

విస్తృతంగా తనిఖీలు



తూము వద్ద తనిఖీ చేస్తున్న పోలీసు బలగాలు


వై.రామవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వై.రామవరం నుంచి సరిహద్దు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిలో పోలీసులు బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ ఎం. సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలను, వాటిలో తరలించే సామగ్రిని పరిశబులించారు. వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు సక్రమంగా లేని వాహనాలపై కేసు నమోదు చేశారు. అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎంఎల్ నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

చందనోత్సవం సీఎఫ్‌వోగా రామచంద్రమోహన్



సింహాచలం: సింహాచలం క్షేత్రంలో వచ్చే నెల 10న జరిగే చందనోత్సవానికి రాష్ట్ర దేవదాయశాఖ తరఫున చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఆ శాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయశాఖ ఈనెల 9న ఉత్తర్వులు జారీ చేసింది. కాగా రామచంద్రమోహన్ 2013 నుంచి 2019 వరకు సింహాచలం దేవస్థానం పూర్తిస్థాయి ఈవోగా పనిచేశారు. 2007-08లో దేవదాయశాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా కూడా విధులు నిర్వర్తించారు. 2008లోను, 2013 నుంచి 2019 వరకు కలిపి ఈవోగా ఎనిమిది చందనోత్సవాలను నిర్వహించారు. ప్రస్తుతం రామచంద్రమోహన్ దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తూనే అన్నవరం దేవస్థానం ఈవోగా కూడా విధులు నిర్వర్తిస్తున్నారు.

మానవ హక్కుల పరిరక్షణ ఫోరం ప్రధాన కార్యదర్శిగా మాధవీలత



విశాఖలీగల్ : జాతీయ మానవ హక్కుల పరిరక్షణ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన మహిళా న్యాయవాది కె.మాధవీలత నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం జాతీయ అధ్యక్షుడు టి.ఎస్.రామచంద్రనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర పరిధిలో మానవ హక్కుల ఉల్లంఘన, అవినీతి ఆరోపణలు, మహిళల పట్ల అకృత్యాలపై ఫిర్యాదులను స్వీకరించి బాధితులకు న్యాయ సహాయం ఆమె అందిస్తారు. ఆమె నియామకం పట్ల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దంత నరేష్‌కుమార్, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, సభ్యులు, పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఐఆర్‌ఈఎల్, స్టీల్‌ప్లాంట్ సీఎండీల భేటీ



ఐఆర్‌ఈఎల్ సీఎండీ దీపేంద్ర సింగ్‌తో చర్చిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ భట్

ఉక్కునగరం: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్(ఐఆర్‌ఈఎల్) సీఎండీ డాక్టర్ దీపేంద్ర సింగ్‌తో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ సమావేశమయ్యారు. స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం జరిగిన ఈ భేటీలో ఇరు సంస్థల మధ్య ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి(ఆర్ అండ్‌డీ) కార్యక్రమాలకు గల అవకాశాల గురించి చర్చించారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఉత్పత్తుల గురించి సీఎండీ భట్‌ను దీపేంద్ర సింగ్ అడిగి తెలుసుకున్నారు.

గీతకు చుక్కెదురు

అరకు ఎంపీ బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకు కూటమి నేతలు షాకిచ్చారు. ఆమె నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీకి దుమ్మా కొట్టి ఏకాకిని చేశారు. రంపచోడవరం టికెట్ తమకు రాకుండా చేసిన ఆమెకు తమ సత్తా ఏంటో చూపించేలా టీడీపీ నేతలు వ్యవహరించారు. జనసేనకు చెందిన ముఖ్యనేతలు కూడా దూరంగా ఉన్నారు. దీంతో కూటమిలో కుంపటి రాజుకుంది.

- రంపచోడవరంలో ఆమె నిర్వహించిన ర్యాలీకి స్పందన కరువు
- సమావేశం, ర్యాలీకి టీడీపీ నేతలు దూరం
- జనసేన శ్రేణులదీ అదే పరిస్థితి
- 'వన్ ఉమన్ షో'గా కార్యక్రమం



కొత్తపల్లి గీత ఎన్నికల ప్రచార ర్యాలీలో కానరాని జనం

రంపచోడవరం: అరకు ఎంపీ కూటమి అభ్యర్థి, బీజేపీ నేత కొత్తపల్లి గీతకు చుక్కెదురైంది. బుధవారం రంపచోడవరం, గంగవరం, అడ్డతీగలలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీకి టీడీపీ ముఖ్యనేతలు, కార్యకర్తలు దుమ్మాకొట్టారు. ఆశించిన స్థాయిలో ఆ పార్టీతోపాటు జనసేన నేతలు రాకపోవడంతో ఈ కార్యక్రమం 'వన్ ఉమన్ షో'గా మారింది. బాపనమ్మ గుడి వద్ద నుంచి రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల వరకు ర్యాలీకి జనం లేక మొక్కుబడిగా సాగింది.

ఆమె పెత్తనమేంటి?

రంపచోడవరం మండలానికి సంబంధించి ముఖ్యమైన నాయకులు ర్యాలీకి రాలేదు. టీడీపీ పార్టీ వ్యవహారాల్లో కొత్తపల్లి గీత తలదూర్చడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆగ్రహంతో ఉన్న వారంతా ర్యాలీకి హాజరు కాకుండా సత్తా చూపించారు. దీంతో కూటమిలో నేతల విభేదాలు మరోసారి బయటపడ్డాయి. రంపచోడవరం అసెంబ్లీ సీటును మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేష్ ఆశించడం తెలిసిందే. వీరిని కాదని పార్టీ అధిష్టానం మిరియాల శిరీషాదేవి అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి తమకు గీత వల్లే అన్యాయం జరిగిందని వారంతా గుర్రుగా ఉన్నారు. శిరీషా దేవి నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాలకు కూడా వారు దూరంగానే ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో నిర్వహించిన ర్యాలీకి శిరీషాదేవిపైన కొత్తపల్లి గీత ఆధారపడ్డారు. అయితే ఆమె ఆశించినట్టుగా పార్టీ శ్రేణులు, జనాన్ని తీసుకురాలేకపోయారు. ప్రధాన సెంటర్ అయిన గంగవరంలో ఆగకుండానే ర్యాలీ ముందుకు సాగడం అక్కడి టీడీపీ నేతలను మరింత అసంతృప్తికి గురి చేసింది. గంగవరం మండలానికి చెందిన సీనియర్ నాయకులు ఇప్పటికే రంపచోడవరం టీడీపీ అభ్యర్థిని మార్పు చేయాలని తీర్మానం చేసి పార్టీ పరిశీలకుడికి పంపించారు. ఈ మండలం నుంచి ఒకరిద్దరు నాయకులు తప్ప ముఖ్య నాయకులు ఎవ్వరూ ర్యాలీలో పాల్గొనలేదు. అడ్డతీగల దేవీగుడి సెంటర్‌లో ర్యాలీ అనంతరం ఎంపీ అభ్యర్థి గీత మాట్లాడారు. అయితే అక్కడ స్థానికంగా ఉన్న టీడీపీ శ్రేణులు కూడా హాజరు కాలేదు.

చివరికి అరకొరగా జనం: సీతపల్లి నుంచి ప్రారంభమైన ర్యాలీ రంపచోడవరం చేరుకునే సరికి అరకొరగా మాత్రమే జనం మిగిలారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో కొద్ది నిమిషాలు కొత్తపల్లి గీత మాట్లాడారు. రంపచోడవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఆమె చెప్పడంతో.. 2014 ఎన్నికల తరువాత ఎప్పుడూ తమకు కనిపించని గీత ఇప్పుడేం చేస్తుందంటూ స్థానికులు చర్చించుకున్నారు.

భవిష్యత్తు కార్యాచరణపై నేడు టీడీపీ నేతల సమావేశం

రంపచోడవరం టీడీపీ అభ్యర్థిగా మిరియాల శిరీషాదేవిని ప్రకటించిన నాటి నుంచి టీడీపీలో రగిలిన ఆగ్రహజ్వాలలు కొనసాగుతున్నాయి. పార్టీ కోసం పనిచేసిన వారికి న్యాయం జరగలేదని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆరోపించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాడేరులో టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతానని ప్రకటించడంతో రంపచోడవరంలో కూడా టీడీపీ రెబల్ అభ్యర్థిని బరిలో దింపేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగానే గురువారం రంపచోడవరంలో టీడీపీ నేతలు సమావేశం కానున్నట్లు సమాచారం. అభ్యర్థి మార్పుపై అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని వారంతా ఎదురు చూశారు. అయితే ఎటువంటి స్పందన లేకపోవడంతో తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి

- నేడు ఈద్ ప్రత్యేక ప్రార్థనలు
- ముస్తాబైన ఈద్గాలు, మసీదులు



పాడేరులో విద్యుత్ దీపాల అలంకరణలో పురాతన మసీదు

చింతూరు/సాక్షి, పాడేరు : రంజాన్ పండుగను గురువారం జరుపుకునేందుకు జిల్లావ్యాప్తంగా మసీదులు ముస్తాబయ్యాయి. రంజాన్ నమాజు ఆచరించేందుకు రంపచోడవరంలోని మక్కా మసీదు, చింతూరులోని మస్జిదే యాసీన్‌తో పాటు జిల్లా కేంద్రం పాడేరు, మండల కేంద్రాల్లోని మసీదులు సిద్ధమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో నమాజు ఆచరించేందుకు ఈద్గాలను సిద్ధం చేశారు. దుస్తులు, టోపీలు, సెంటు, సుర్మాతో పాటు సేమ్యా, జీడిపప్పు, కిస్‌మిస్ కొనుగోళ్లతో జిల్లా కేంద్రం పాడేరు, చింతూరు, రంపచోడవరం మార్కెట్లలో సందడి నెలకొంది. బుధవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్‌తో ఉపవాస దీక్షలు, తరావీ నమాజు పూర్తయినట్లు ఇమాం ప్రకటించారు. హిందూ, ముస్లిం సోదరులు మత సామరస్యాన్ని చాటుకునేందుకు రంజాన్ ఎంతగానో దోహదపడుతుంది. నమాజు పూర్తయిన తరువాత ముస్లిం సోదరులను హిందూ సోదరులు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెబుతారు. ముస్లిం సోదరులు వారిని తమ ఇళ్లకు ఆహ్వానించి రంజాన్ ప్రత్యేకత అయిన సేమ్యా పాయసాన్ని వారికి తినిపిస్తారు.

శుభాల మాసం ముగిసింది



ప్రతి ముస్లింకు శుభాలను సమకూర్చే రంజాన్ మాసం ముగిసింది. దివ్య ఖురాన్ అవతరించిన నెల కావడంతో ఈనెలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. తమలోని చెడు అలవాట్లను త్యజించి నైతిక విలువలు పెంపొందించుకునేందుకు ఈ మాసం ఎంతో ఉపయోగ పడింది. ఉపవాస దీక్షలు, నమాజులు ఆచరించడం వల్ల ప్రేమ, శాంతి, సామరస్యాలు అలవడుతాయి.

– ఎండీ ఎజాజ్ అహ్మద్, మసీదు ఇమాం, చింతూరు



రాజవొమ్మంగిలో ముస్తాబైన మసీదు

సీఎం బస్సుయాత్రకు సన్నాహాలు



సీఎం బస్సు యాత్ర రూట్ మ్యాప్ రూపకల్పన సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డితో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, బొడ్డేడ ప్రసాద్, మలసాల భరత్‌కుమార్

- రూట్ మ్యాప్ గురించి చర్చించిన వైవీ సుబ్బారెడ్డి
- ఈనెల 20న అనకాపల్లి జిల్లాలో ప్రవేశించనున్న బస్సు యాత్ర

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రను అనకాపల్లి జిల్లాలో ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఏఎస్ పేటలోని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ నివాసంలో బస్సు యాత్ర రూట్ మ్యాప్ గురించి పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి బుధవారం రాత్రి చర్చించారు. పాయకరావుపేట నుంచి ప్రారంభమయ్యే బస్సు యాత్ర యలమంచిలి, తాళ్లపాలెం, కశింకోట, అనకాపల్లి, తుమ్మపాల మీదుగా సాగుతుంది. అనంతరం చోడవరం నియోజకవర్గంలో ప్రవేశిస్తుంది. ఈ మేరకు రూట్ మ్యాప్‌ను రూపొందించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా మలసాల భరత్‌కుమార్ సుబ్బారెడ్డికి దుశ్శాలువా కప్పి సత్కరించారు. పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సంక్షేమం.. అభివృద్ధి గెలిపిస్తుంది



ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు

- జగనన్నను మళ్లీ సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధం
- వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- మోదకొండమ్మ తల్లి సన్నిధిలో పూజలు
- పార్టీ ప్రచార రథం ప్రారంభం

సాక్షి,పాడేరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తాయని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు ధీమా వ్యక్తం చేశారు. పాడేరులోని మోదకొండమ్మ తల్లి సన్నిధిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అనంతరం విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అరకు పార్లమెంట్ స్థానంతోపాటు నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని తెలిపారు. మైదాన ప్రాంతాలకు దీటుగా గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. నవరత్నాల పథకాలతో సంక్షేమ పథకాలతో గిరిజనుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. జగనన్న చేసిన మేలుకు వారంతా ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అభ్యర్థులను గెలిపించి రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, ఎంపీటీసీలు కె.నరసింహమూర్తి, లకే రామకృష్ణపాత్రుడు, సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు, వనుగు బసవన్నదొర, మాజీ సర్పంచ్‌లు మినుముల కన్నాపాత్రుడు, సిరగం దశమూర్తి, పాంగి సత్తిబాబు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పసుపుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో మోగిన రెబెల్స్

చంద్రబాబు క్షుద్ర రాజకీయాల కారణంగా అట్టడుగు స్థాయికి దిగుజారుతున్న టీడీపీకి ఇప్పుడు రెబల్స్ బెడద మొదలైంది. పాడేరు, అరకు నియోజకవర్గాల్లో సీనియర్లను పక్కనబెట్టిన ఆ పార్టీ అధిష్టానానికి తమ సత్తా ఏంటో చూపేందుకు వారంతా సిద్ధమయ్యారు. తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేసి తమ తడాఖా చూపిస్తామని అరకులో ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత సివేరి అబ్రహం, పాడేరు టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి బుధవారం హెచ్చరించారు. ఇప్పటివరకు అధిష్టానానికి గడువు ఇచ్చామని, అయినప్పటికీ మార్పులేకపోవడంతో ఇక తాము తగ్గేది లేని స్పష్టం చేశారు. విజయం సాధించి తమ సత్తా ఏంటో చూపిస్తామని వారు హెచ్చరించారు.

పోటీ చేస్తా.. గెలిపించండి

- మోసం చేసిన అధిష్టానం
- పార్టీకి తీవ్ర నష్టం చేస్తున్న చర్యలు
- టీడీపీ శ్రేణులతో ఆపార్టీ నేత, ఎస్సీ ఎస్టీ మాజీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం



అరకులోయలో పార్టీ శ్రేణులతో ర్యాలీ నిర్వహిస్తున్న సివేరి అబ్రహం

అరకులోయ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో అరకు అసెంబ్లీ స్థానానికి రెబల్‌గా పోటీ చేస్తానని టీడీపీ నేత, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం స్పష్టం చేశారు. మండల కేంద్రం అరకులోయలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో బుధవారం నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టికెట్ కేటాయించే విషయంలో టీడీపీ అధిష్టానం తనను మోసం చేసిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. పార్టీ కోసం శ్రమించి జెండా మోసిన వారికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పొత్తులతో పార్టీ కార్యకర్తలను అధిష్టానం మరింత అయోమయంలోకి నెట్టేసిందన్నారు. ఇలాంటి చర్యల వల్ల పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఎన్నికల్లో అందరూ సమష్టిగా పనిచేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం టీడీపీ శ్రేణులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు శాస్త్రిబాబు, అప్పారావు, ఇచ్చావతి, సివేరి సురేష్, దొన్ను, భూషణ్ పాల్గొన్నారు.

22న నామినేషన్ వేస్తా..

- టికెట్ ఇవ్వకుండా మోసం చేసిన టీడీపీ అధిష్టానం
- అసెంబ్లీకి పోటీ చేసి సత్తా చాటుతా
- ఆ పార్టీ పాడేరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



అనుచరులను ఉద్దేశించి మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

పాడేరు: పాడేరు అసెంబ్లీ టికెట్ కేటాయింపులో తనకు అన్యాయం జరిగినందున టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీచేస్తానని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి స్పష్టం చేశారు. బుధవారం ఆమె కుమ్మరిపుట్టులోని తన నివాసంలో అనుచరులతో సమావేశం నిర్వహించారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్న తరువాత రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉనికి లేని టీడీపీకి తాను శక్తివంచన లేకుండా కృషి చేసి జీవం పోశానని, టికెట్ కేటాయింపులో నిలువునా పార్టీ అధిష్టానం మోసం చేసిందని ధ్వజమెత్తారు. కార్యకర్తలు, అనుచరుల అభీష్టం మేరకు ఈనెల 22న భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తానని ప్రకటించారు. ఇప్పటికే టీడీపీ అభ్యర్థిగా కిల్లు రమేష్‌నాయుడు పేరును అధిష్టానం ప్రకటించడం తెలిసిందే.ఈ నేపథ్యంలో ఆమె ప్రకటనతో టీడీపీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ లక్ష్యం

- ప్రతి ఫిర్యాదు నమోదు కావాల్సిందే
- చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు
- కలెక్టర్ విజయ సునీత



ఈవీఎంల వినియోగంపై శిక్షణ ఇస్తున్న కలెక్టర్ విజయ సునీత

సాక్షి, పాడేరు: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యమని కలెక్టర్ ఎం.విజయ సునీత అన్నారు.జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి బుధవారం పలు సమావేశాలు నిర్వహించారు .కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ విభాగాన్ని ఆమె తనిఖీ చేశారు. అన్ని విభాగాల నోడల్ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు.ఎన్నికలకు సంబంధించి స్వీకరించిన ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని వంతాడపల్లి, డముకు తదితర ఐదు చెక్‌పోస్టుల్లో తనిఖీలను లైవ్ ద్వారా పరిశీలించారు.

అత్యవసర ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

అత్యవసర సర్వీసుల ఓటర్లు పోస్టల్ బ్యాలెట్లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.కలెక్టరేట్‌లో అత్యవసర సర్వీసులకు సంబంధించిన పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ అర్హత ఉన్న అధికారులు.ఉద్యోగులతో పాటు 40శాతం పైబడిన విభిన్న ప్రతిభావంతులు,అనారోగ్యానికి గురై మంచాన పడిన వారు కూడా పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దివ్యాంగులకు సౌకర్యాలు: దివ్యాంగులంతా సార్వత్రిక ఎన్నికలలో సులభంగా ఓటు వేసేందుకు పలు సౌకర్యాలు కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల నిర్మాణం చేపట్టామని,ముందుగా అధికారులు నివేదిక ఇస్తే వీల్‌చైర్లు కూడా అందుబాటులో ఉంచుతామన్నారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు దివ్యాంగులు, అంధులకు సహాయకులను అనుమతిస్తామని తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై దివ్యాంగులు, అంధులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనితెలిపారు.

శిక్షణ కార్యక్రమాలు సద్వినియోగం: ఈవీఎంల నిర్వహణపై అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని పోలింగ్ విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ విజయసునీత కోరారు.స్థానిక గురుకుల విద్యాలయంలో పాడేరు, అరకులోయ అసెంబ్లీల పరిధిలోని జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎంల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌కు ముందు రోజు నుంచి పోలింగ్ ముగిసి ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చే వరకు బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు.అరకు అసెంబ్లీ ఆర్వో, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్,బ్యాలెట్ యూనిట్ల నిర్వహణపై అవగాహన పొందాలన్నారు.మాక్‌పోల్,ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు.డీఆర్వో పద్మావతి,ఎస్‌డీసీలు,నోడల్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రూప్-2 మెయిన్స్‌కు 43 మంది అర్హత

- ఐటీడీఏ పీవో అభిషేక్ వెల్లడి
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన

పాడేరు : రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షల్లో 43 మంది గిరిజన విద్యార్థులు విజయం సాధించి మెయిన్స్‌కు అర్హత సాధించారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో విశాఖ నగరంలోని వేపగుంట వైటీసీలో 60 మంది సివిల్స్ శిక్షణ పొందుతున్నారు. వీరిలో 59 మంది విద్యార్థులు ఇటీవల నిర్వహించిన గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్ష రాయగా 43 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారు. వీరిని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌తో పాటు శిక్షణ అందిస్తున్న 21వ సెంచరీ సంస్థ నిర్వాహకులు అభినందించారు. ఇదే స్ఫూర్తితో మెయిన్స్‌లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

ఫొటో మార్ఫింగ్ చేసి వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్


సాయికుమార్

విశాఖ సిటీ: మహిళ ఫొటోను మార్ఫింగ్ చేసి నకిలీ జీమెయిల్ ఐడీ ద్వారా పంపించి వేధిస్తున్న వ్యక్తిని విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన యువతి ఒక ప్రముఖ కంపెనీలో పని చేస్తోంది. సదరు యువతకి సంబంధించిన మార్ఫింగ్ ఫొటోతో పాటు చెడుగా అదే కంపెనీలో పనిచేస్తున్న సుమారు 500 మంది ఉద్యోగులకు మెయిల్స్ వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న బాధిత మహిళ ఈ విషయాన్ని కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లింది. దీంతో వారు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతికత సహాయంతో ఆ మెయిల్స్ పంపించింది అదే కంపెనీకి చెందిన మాజీ ఉద్యోగి అయిన నగరానికి చెందిన డబ్బీరు సాయికుమార్ అని గుర్తించి అరెస్టు చేశారు. సాఫ్ట్‌వేర్‌లో మంచి పరిజ్ఞానం ఉన్న సాయికుమార్ ఎవరికి దొరకకుండా ఉండేందుకు నకిలీ ఈమెయిల్‌ను క్రియేట్ చేసి వీపీఎన్ ద్వారా ఐపీలను మార్చి యువతిని వేధించాడు. అయినప్పటికీ పోలీసులు చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్నారు.

భలే మంచి లంచ్ బేరం

టీడీపీ నాయకుల నోట్ల రాజకీయం

- లంచ్, డిన్నర్‌కి పిలవడం.. బేరాలు మాట్లాడటం..
- సర్పంచ్ నుంచి ఇన్‌చార్జి వరకూ ఒక్కొక్కరికీ ఒక్కో రేటు
- భీమిలిలో ఓ నేతను రూ.2 కోట్లకు కొనుగోలు చేసిన గంటా
- సర్పంచ్‌కు రూ.2 లక్షలు.. ఎంపీటీసీకి రూ.3 లక్షలు
- బేరం కుదరగానే కండువాలు మార్చేస్తున్న చోటా నేతలు

సాధారణంగా ఒక హోటల్‌లో లంచ్ చేస్తే సుమారు రూ.500 బిల్లు అవుతుంది.. అదే స్టార్ హోటల్ అయితే రూ.1000 నుంచి రూ.1500. కానీ ఉమ్మడి విశాఖ జిల్లాలోని టీడీపీ నేతల ఇళ్లల్లో మాత్రం లంచ్ ఖరీదు రూ.లక్షల్లోనే ఉంటుంది. లంచ్ ఒక్కటే కాదు.. టీ, టిఫిన్, డిన్నర్ ఏదైనా చాలా ఖరీదు చేసేశారు. ఇంతకీ ఈ లక్షల రూపాయల లంచ్ గురించి తెలుసుకుంటే నోరెళ్లబెట్టాల్సిందే.



సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక సమరం సమీపిస్తున్న తరుణంలో ఓటమి తప్పదని గ్రహించిన టీడీపీ అడ్డదారులు తొక్కుతోంది. ఓట్ల రాజకీయంతో పనికాదని గ్రహించి.. నోట్ల రాజకీయాలకు తెర తీసింది. ప్రత్యర్థి పార్టీ నేతలను లంచ్, డిన్నర్‌కి పిలిచి బేరాలు పెడుతోంది. సర్పంచ్ నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి వరకూ ఒక్కొక్కరికీ ఒక్కో రేటు నిర్ణయించేస్తోంది. ఇందులో సిద్ధ హస్తుడుగా ఉన్న గంటా శ్రీనివాసరావును ఆదర్శంగా తీసుకొని.. అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ నేతలు ఇదే ఫార్ములా అవలంబిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీ నేతలను సంతలో పశువుల్లా బేరాలాడి కొనేస్తే చాలని లెక్కల్లో తలమునకలయ్యారు. లంచ్, డిన్నర్ పేరుతో లక్షలు ముట్టజెబుతున్నారు.

గంటా రూటే సేపరేట్

టీడీపీ పెద్దల కాళ్లా వేళ్లా బతిమాలి ఎట్టకేలకు భీమిలి టికెట్ సాధించుకున్న గంటాకు ఎన్నికలంటే డబ్బుతో గెలవడమే అనే నైజం. ప్రజలన్నా నాయకులన్నా ఆయన దృష్టిలో ఓటును, వ్యక్తిత్వాన్ని అమ్ముకునే మనస్తత్వం కలవారు. రూ.500కి వెయ్యకపోవచ్చు.. రూ.వెయ్యికి వెయ్యకపోవచ్చు.. రూ.2 వేలు.. ఇలా.. ఏదో ఒక నంబర్ దగ్గర ఓటరు తనకు లొంగుతారనే విశ్రీగే మనస్తత్వంతో రాజకీయాలు చెయ్యడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యగా మారిపోయింది. ఇదే మాదిరిగా చోటా మోటా నాయకులకు సైతం వెలకడుతున్నారు. గంటా ఒక్కరే కాదు టీడీపీ నుంచి టికెట్ కొనుక్కున్న ప్రతి ఒక్క నాయకుడూ ఇదే రీతిలో ఆలోచిస్తూ రాజకీయాల్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు.

విలువలు అమ్ముకుంటూ రాయ'బేరాలు'

వెన్నుపోటు రాజకీయాలు మొదలైనప్పటి నుంచి విలువలను విడిచిపెట్టి అడ్డగోలుకు కేరాఫ్‌గా మారిపోయింది టీడీపీ. అంతా ఆ తాను ముక్కలే అన్నట్లుగా పార్టీలో ఉన్నవారంతా కనీస విలువలు లేకుండా వ్యవహరిస్తున్నారు. డబ్బుతోనే ఏదైనా సాధ్యమనే అహంకారంతో విర్రవీగుతున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ టీడీపీ అభ్యర్థులు తమ ఇంటికి లేదా సమీపంలో ఉన్న ఓ హోటల్‌కి భోజనానికి ఆహ్వానించడం.. రాయ'బేరాలు' మాట్లాడుకోవడమే పరమావధిగా రాజకీయాలు చేస్తున్నారు. బేరం కుదిరిన వెంటనే చోటా నేతలు కండువాలు కప్పేసుకుంటున్నారు.

- చోడవరంలో టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ రాజు ఇటీవలే పలువురు ప్రత్యర్థి పార్టీ నేతలను నోట్ల కట్టలతో కొనుగోలు చేసుకున్నారు.
- పాయకరావుపేటలో వంగలపూడి అనిత.. ఓ హోటల్‌లో సామాజికవర్గ నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులను ఆత్మీయ సమావేశం పేరిట ఆహ్వానించారు. ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడుతూ సర్పంచ్‌కు రూ.2 లక్షలు, ఎంపీటీసీ సభ్యుడికి రూ.5 లక్షలు, 100 ఓట్లు ప్రభావితం చేసే సామాజికవర్గ నాయకుడికి రూ.5 లక్షలకు బేరం పెట్టేసుకున్నారు.
- పెందుర్తిలో పంచకర్ల రమేష్‌బాబు సైతం అదే రాయబేరాలు సాగిస్తున్నారు. ఈయన రూ.లక్ష నుంచి తన బేరాలు మొదలు పెడుతున్నారు.

ఇవి కేవలం మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రతి నియోజకవర్గంలోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గడపగడపకు వెళ్లి ప్రజలకు ఇంకా అందించాల్సిన మౌలిక సదుపాయాలు, వారి అభిప్రాయాలు సేకరిస్తుంటే.. టీడీపీ అభ్యర్థులు మాత్రం.. నేతల కొనుగోలులో బిజీబిజీగా గడుపుతున్నారు.

రూ.2 కోట్లకు డీల్..!

భీమిలి నియోజకవర్గంలో జరిగిన బేరం ఖరీదు అక్షరాలా రూ.2 కోట్లు. ఇక్కడ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ నాయకుడి మద్దతును టీడీపీ నేతలు కోరారు. అతడు ఒప్పుకోలేదు. బతిమలాడారు.. లంచ్, డిన్నర్‌కు ఆహ్వానించారు. పనవ్వలేదు. స్వయంగా వాళ్లే భోజనానికి వెళ్లారు. అర కోటి నుంచి బేరం మొదలైంది... చివరికి రూ.2 కోట్లకు డీల్ కుదిరింది. అక్కడికి వచ్చిన వారు కూడా ఆశ్చర్యపోయారు. అలాగే భీమిలిలో ఓ జెడ్పీటీసీ సభ్యుడికి రూ.10 లక్షల ధర పలికింది. మరికొందరు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు బేరాలు కుదిరినట్లు తెలిసింది. కొంతమంది మాజీ నేతలు, పలుకుబడి ఉన్న నేతలకు కూడా మరో రేటు ఫిక్స్‌చేసినట్లు సమాచారం.

సీఎం రమేష్ రాకతో పెరిగిన రేట్లు

300 మంది రౌడీ మూకలను వెంటబెట్టుకొని అనకాపల్లిలో అడుగుపెట్టిన మాజీ టీడీపీ, ప్రస్తుత బీజేపీ నేత సీఎం రమేష్ రాకతో.. ఆయా ప్రతినిధులు తమ రేట్లను అమాంతం పెంచేసుకుంటున్నారు. తమను నమ్ముకొని ఉన్న ప్రజలను పక్కన పెట్టేసి.. తమకింత ఇస్తే చాలు.. మీ పార్టీ కండువా కప్పేసుకుంటామంటూ బేరాలాటలో మునిగి తేలుతున్నారు. ఎన్నికల సమయంలో డబ్బులకు అమ్ముడుపోయి.. పార్టీ కండువాలు మార్చేసుకుంటూ.. టీడీపీ పంచన చేరుతున్న నేతలను చూసి జనం ఛీ కొడుతున్నారు. ఇలాంటి వారినా మనం సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, జెడ్పీటీసీగా గెలిపించామా అని అసహ్యించుకుంటున్నారు.

ఎన్నికల విధులపై పూర్తిస్థాయిలో శిక్షణ

రంపచోడవరం ఆర్‌వో, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



రంపచోడవరం: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఈవీఎంలు, వీవీప్యాట్లపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తామని రంపచోడవరం సబ్ కలెక్టర్, ఆర్‌వో ప్రశాంత్ కుమార్ తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం రంపచోడవరం అసెంబ్లీ మాస్టర్ ట్రైనర్స్‌తో ఎన్నికల విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, విధులకోసం 59 మంది సెక్టోరల్, 73 మంది రూట్ అధికారులను నియమించామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో పీవోలు, ఏపీవోలు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పనిచేయాలన్నారు. ఎన్నికల సరళిపై హ్యాండ్ బుక్‌లో నిబంధనలను పక్కాగా పాటించాలని సూచించారు. రంపచోడవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, వైరామవరం మండలాలకు 12వ తేదీన, గంగవరం, దేవీపట్నం, అడ్డతీగల మండలాలకు ఈనెల 13న రంపచోడవరం లెనోరా ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ ఉంటుందన్నారు. చింతూరు, వీఆర్ పురం, కూనవరం, ఎటపాక మండలాలకు చింతూరులోని గిరిజన సంక్షేమ శాఖ బాలురు పాఠశాలలో అలాగే ఈనెల 15న శిక్షణ ఇస్తామన్నారు. ఆయా కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీలు జి. వీరభద్రరావు, ఎ. సత్యనారాయణ, చైతన్య, విశ్వనాథం, శివ, శ్రీధర్, సుబ్బారావు, స్వామి పాల్గొన్నారు.

11 మద్యం బాటిళ్ల పట్టివేత

అనకాపల్లి : మద్యం క్వాటర్ బాటిల్స్ తరలిస్తున్న కశింకోట మండలం, వెదురుపర్తి గ్రామానికి చెందిన కె.రోహిత్‌పై కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ రామకృష్ణ చెప్పారు. కొత్తూరు జాతీయ రహదారి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనకాపల్లి నుంచి వెదురుపర్తికి 11 మద్యం క్వాటర్ బాటిల్స్ తరలిస్తూ అతను పట్టుబడ్డాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జగనన్న పథకాలు చంద్రబాబు కాపీ

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు

ముంచంగిపుట్టు: జగనన్న ప్రవేశపెట్టిన పథకాలకు ప్రజాదరణ చూసి ఓర్వలేక పేర్లు మార్చి జగనన్న పథకాలనే చంద్రబాబు కాపీ కొడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విమర్శించారు. మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ ధారపల్లిలో బుధవారం మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్న జగనన్న విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు కలిగిన లబ్ధిని తెలియజేయాలని కోరారు. బలవంతుడైన జగనన్నను సింగిల్‌గా ఎదుర్కోలేక బలహీనులంతా కుమ్మక్కై పోటీపడాల్సిన దుస్థితిలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉన్నాయని ధ్వజమెత్తారు. అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగంను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు శోభా హైమావతి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభా సోమేశ్వరి, ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, జేసీఎస్ మండల కన్వీనర్ వంతాల కొండలరావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు వెంగడ రమేష్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి


మావోయిస్టుల దాడుల్లో అసువులు బాసిన గిరిజనుల స్మారక స్థూపాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లిరూరల్: యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. మండలంలో బలపం పంచాయతీ వీరవరం గ్రామంలో గెమ్మిల సంజీవరావు స్మారక స్థూపం ప్రారంభం, ×యువహో× వాలీబాల్ పోటీలు, మరయు ×సంజీవరావు స్మారక । మెడికల్ క్యాంప్ జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా సహకారంతో పోలీస్ వారు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ వీరవరం గ్రామానికి చెందిన సంజీవరావును 2014లో మావోయిస్టులు కిరాతకంగా హత్య చేశారన్నారు. ఇలాంటి హింసత్మాక కార్యక్రమాలకు పాల్పడుతున్న మావోయిస్టులతో గ్రామస్తులు దూరంగా ఉండాలన్నారు.

గిరిజన యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దాన్నారు. మావోయిస్టుతతో సంబంధాలు, గంజాయి రవాణ, వంటి అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం వాలీబాల్ పోటీల్లో విజేత జట్లకు ట్రోఫీలను అందజేశారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీఐ రమేష్, ఎస్ఐలు అరుణ్‌కిరణ్, వెంకటరమణ, రాజారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా

కూర్మన్నపాలెం: ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా చేస్తున్న భార్యాభర్తలను దువ్వాడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ.. బెంగళూరులో నివాసముంటున్న భార్యాభర్తలు నాగరాజు, భారతికి ఇద్దరు పిల్లలు. కుక్కలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వీరికి చంద్రప్ప అనే వ్యక్తి పరిచయమయ్యాడు. వీరి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న చంద్రప్ప నర్సీపట్నం వెళ్తే అక్కడ ఓ వ్యక్తి గంజాయి ఇస్తాడని.. దానిని తీసుకువస్తే అధిక మొత్తంలో నగదు ఇస్తానని ఆశ చూపాడు. రవాణా చార్జీలు కూడా తానే భరిస్తానని చెప్పడంతో భార్యాభర్తలిద్దరూ ఈ నెల 8న బెంగళూరు నుంచి తుని చేరుకున్నారు. అక్కడ నుంచి బస్సులో నర్సీపట్నం వెళ్లి బస్టాండ్‌లో బస చేశారు. బుధవారం ఉదయం ఆర్టీసీ బస్టాండ్ వద్దకు ఓ వ్యక్తి వచ్చి గంజాయి బ్యాగులను వారికి అందజేశాడు. దీంతో చంద్రప్ప నర్సీపట్నం నుంచి విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకుని.. అక్కడి నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరు రావాలని ఫోన్‌లో వారికి ఆదేశించాడు. రెండు కిలోలు చొప్పున 7 ప్యాకెట్లలో 14 కిలోల గంజాయితో వారు నర్సీపట్నం నుంచి విశాఖకు ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. ఎన్నికల నేపథ్యంలో అగనంపూడి టోల్‌గేట్ వద్ద అధికారులు, దువ్వాడ పోలీసులు బస్సు తనిఖీ చేయగా.. వారి వద్ద గంజాయి పట్టుబడింది. భార్యాభర్తలను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.75వేలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వైఎస్సార్‌సీపీ విజయమే అందరి లక్ష్యం


మాట్లాడుతున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం


మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

పెదబయలు: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా పనిచేయాలని అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పార్టీ కేడర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఈ ఐదేళ్లలో అమలుచేసిన సంక్షేమ పథకాల లబ్ధిని, పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధిని ప్రతి గడపకు వెళ్లి వివరించాలన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మునపెన్నడూ నియోజకవర్గంలోని జరగని అభివృద్ధి నేడు జగనన్న ప్రభుత్వంలో జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న రేగం మత్స్యలింగంను అధిక మెజార్టీతో గెలిపించేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పార్టీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ కుటుంబానికి నవరత్నాలు, సంక్షేమ పథకాలు అందించారని గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారధులు. సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటా తిరిగి ప్రచారం చేయాలని. ప్రతీ ఓటరును కలిసి, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేందుకు అభ్యర్థించాలన్నారు. అరకు నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు శోభ హైమావతి, జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ మండలంలో నాయకులందరూ క్లస్టర్ల వారీగా విభజించుకుని పనిచేయాలన్నారు. గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిందన్నారు.


సమావేశానికి హాజరైన సచివాలయం కన్వీనర్లు, నాయకులు

మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ వి.సన్యాసి, స్వచ్ఛభారత్ డైరెక్టర్ సోభ సోమేశ్వరి, ఎంపీపీ బొండా వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లంగి ఉమామహేశ్వరరావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు నాయకులు అప్పలరాజు మాజీ జెడ్పీటిసీలు గంగాభవాని. సూర్యనారాయణ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం. సర్పంచులు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా జగనన్నతోనే ప్రజలకు మేలు

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి


పాతరామవరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం : రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని భయ్యనపల్లి, పాతరామవరం, ఉమ్మెత్త, రాజవరం-1, రాజవరం-2, జియ్యంపాలెం, జగ్గంపాలెం ఓజుబంద గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వైఎస్సార్‌సీపీకి మద్దతు కోరుతూ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమాన అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ఐదేళ్ల పాలన సాగిందన్నారు. రానున్న రోజుల్లో సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అనుబంధ సంఘాలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు వీర సైనికుల్లా పనిచేయాలన్నారు. సోషల్ మీడియాలో ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న కుట్రలను సోషల్ మీడియా ద్వారానే ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలన్నారు. ఐదేళ్ల పాలనలో సీఎం జగనన్న చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి వెళ్లి వివరించాలన్నారు. 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు వైఫల్యాలను..ఐదేళ్లలో జగనన్న సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్ ఎంపీపీలు , గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు పద్మావతి, కోఆప్షన్ సభ్యుడు కెఎస్.ప్రభాకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు పార్వతి, లీలావతి, రమణమ్మ, లక్ష్మి, కామరాజు, మరిడమ్మ, సొసైటీ డైరెక్టర్ పండా సిద్ధార్థ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అప్పలరాజు, పార్టీ ఇన్‌చార్జ్ రఘునాథ్, మాజీ సర్పంచ్‌లు నాగేశ్వరరావు, శంఖు రుదొర, పార్లమెంట్ జిల్లా కార్యదర్శి ఏడుకొండలు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ ఎం.శ్రీను పాల్గొన్నారు.

అప్పన్న చందనోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

మహారాణిపేట: మే 10న జరగనున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఈవో శ్రీనివాసమూర్తి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఇతర విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో బుధవారం చందనోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా దర్శనాలు ఉంటాయన్నారు. మే 10వ తేదీ ఉదయం 3.30 నుంచి 4.30 గంటల వరకు మాత్రమే అనువంశిక ధర్మకర్త, టీటీడీ నుంచి పట్టువస్త్రాలు సమర్పించే వారికి, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు, దాతలకు అంతరాలయ దర్శనాలు ఉంటాయని స్పష్టం చేశారు. నగరంలో 7 నుంచి 10 బ్యాంకుల్లో టికెట్ల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి, మే 6వ తేదీలోపు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది కొండపైకి వాహనాల రాకపోకలను గణనీయంగా తగ్గించేలా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. భక్తులను కొండ దిగువ నుంచి పైకి తరలించేందుకు.. దర్శనం పూర్తయ్యాక కొండ దిగువన దించేందుకు తగినన్నీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులకు ఆ రోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల సమయంలో దర్శనం కోసం శ్లాట్ ఇవ్వాలని చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ అడ్మిషన్స్ FAST TRACK: (ఇంటర్/ డిగ్రీ/ పీజీ/ఎంబీఏ పైలెట్) ఐర్లాండ్/UK/ USA/ యూరప్‌లో MS/MBA/MBBS/LLB/PG/ PHD/ ఫార్మసీ/నర్సింగ్ చేసే అవకాశం: 7993080835 [HA-15]

Services

BUSINESS OFFER

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్ ప్లేట్ & LED మిషన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడిపదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-1454]

■ SVS TDR CONSULTANTS TDR bonds available across Andhra Pradesh Contact: 6305216567, 6305226567 [WB-772]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11800]

Wanted

■ Seeking Experienced Professional in the Tourism Sector with over 4 years of Experience with Bachelor's Degree (in any field) for a Tourism Development project in the Araku - Lambasingi region. The Candidate to be Stationed in Paderu, ASR District. Interested, please email your CV to sajith.shaik@inidesignstudio.com and ketan.patel@inidesignstudio.com [HA-00016]

■ ఇంటి వద్ద నుండి ఫోన్స్ కాల్స్ మాట్లాడుటకు యువతీ, యువకులు & మహిళ గృహిణులు 10th ఆపైన, జీతం: 11,400 వర్క్ చేయుటకు ఇంట్రస్ట్ కలిగిన అభ్యర్థులు కావలెను.✆ 99894 75706 [B-788094]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520,89197 39694. [M-1233961]

■ విక్రాంత్ సెక్యూరిటీ : దువ్వాడ VSEZ లో పనిచేయుటకు 10th పాసై 35-40 సం॥లోపు గల సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం + ESI, PFతో కలిపి రూ. 16,000/-. ఫోన్ : 91001 08011, 63661 82757 [V- 2484]

■ హైదరాబాద్ లోని ఆప్తా హోంకేర్ లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F caretakers కావలెను. జీతం 18-20 వేలు. భోజనం, వసతి, ఇన్సూరెన్సు గలవు. కాంటాక్ట్: 9381848549 [G-2404]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073 [HA-16]

క్రికెట్ గురించి తాజా సమాచారానికి, రచనలకు www.sakshi.com సాక్షి స్పోర్ట్స్

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా నాలుగు లైన్లు రూ.475/- అదనపు లైను రూ.100/- + 5% జి.ఎస్.టి. అదనం